ఆ ఇంటిమీది కాకి ఈ ఇంటి మీద వాలదవేవారు.

ఆ ఇల్లు జగదీశ్వరరావుది.

ఈ ఇల్లు వీరభద్రానిది.

కాకు లట్లా ప్రవర్తించటానికి గల మూలకారణం మూలబడిపోయి చాలా కాలం అయింది.

అప శీ వైషమ్యానికి అంకురార్పణ వాళ్ళ తాతలనాడు జరిగింది. ఆ అంకురమే దినదిన ప్రవర్ధమానమై వారి సంతతి సంతతి మధ్య పేడు రీవిగా విరిచి, దాని గాలి కాయలకూ సోకించి వాటిలో కూడా భేదాభిప్రాయాలు కలగ జేసింది.

ఆ ఇంటి పూర్వ గాధ : తాతలనాడు ప్రారంభిస్తే జగదీశ్వరరావు తాతకు ఒక్కడే కొడుకు. అతని కిత డొక్కడే కొడుకు.

ఈ ఇంటి పూర్వ గాథ: అక్కడే ప్రారంభిస్తే ఇంతవరకూ అంతే.

తాతలనాటి వైరం గోరంత పెట్టంతై, అంతరంలో మిట్టంత గుట్టంతై, వేడు కొండంతై, ముందు ముందు దేనంతవుతుందో తెలియకుండా ఉంది.

నారు పోసిన దేవుడు నీరు పోయడా అనే నమ్మిక ఇద్దరిలోనూ లేక ఇటు వీరభద్రం ఓ కుండెడు నీళ్ళు పోస్తే, అటు జగదీశ్వరరావు పోటీ పడి రెండు కడవలు గుమ్మరించి ఆ కొండకు మాత్రం లోటు లేకుండా చేస్తూనే ఉన్నారు.

ఈ ఇంటిలో ప్రవేశించిన ఆ ఇంటి కోడి కాలు విరిగితే, ఆ పెరట్లో పడ్డ ఈ ఇంటి పడ్డ వడుం విరిగేది.

సిద్ధాంతం దెబ్బకు దెబ్బే అయినా, దెబ్బల మోతాదు ఇత్యాదులలోనూ, వాటిల్లిన నష్టంలోనూ తారతమ్యా లున్నందువల్ల, ఇదేమి న్యాయమయ్యా అంటే, అదిమాత్ర మేమి న్యాయమయ్యా అంటూనే మరో ఘోరం జరిపించేవా డితను.

రెట్టించి ముట్టించేవా డతను.

* * *

జగ్గూ పెళ్ళాం నీళ్ళు పోసుకుంది.

వీరభద్రగిపోయి మీసం మరింత మెలిదిప్పా డతను. పుట్టబోయేది కొడుకేనని తానే జోస్యం చెప్పాడు.

ప్రతిక్రియకు ప్రతిక్రియ తన చేతిలో లేకపోయినందుకు ధగిలిపోయాడు భద్రం.

తన పెళ్ళాం మీద చిరుబుర్లాడాడు.

"వాకుమాత్రం కోర్కె లేదా?" అనేసిం దామె, అమాయకంగా.

"అయితే, పోదాం పద" అన్నాడు.

"ఎక్కడికి?"

"సింహాచలం."

"దేనికి?"

"కప్ప స్తంభాన్ని కౌగిలించుకునేందుకు."

సరేనన్న దామె.

జగ్గూ అత్తవారిదీ ఆ ఊరే అయినందున సీమంతం ఘనంగా జరిపించే ఏర్పాట్లు చేస్తూ ముహూర్తాలు వెతికిస్తున్నాడు జగ్గూ.

'వెతికించు, వెతికించు. సరిగ్గా అదే ముహూర్తానికి నేను సింహాచలంలో ఉండకపోతే చూడు' అని తనలో తానే అనుకున్నాడు భద్రం.

చూడలేకపోయాడు జగ్గూ. ఎందుకంటే, సీమంతోత్సవం సందట్లో ఉండిపోయాడు. అయితే, భద్రం ఊళ్ళో లేకపోయినందుకు విచారంతో కుమిలిపోయాడు.

సింహాచలం నుండి వచ్చాక సంతర్పణ చేశాడు భద్రం.

రోజులు వారా లయ్యాయి. వారాలు నెల లయ్యాయి. మధ్యలో భార్యకు ఏ రకం సుస్తీ చేసినా — "వికారంగా ఉందా? వాంతులుగాని అయ్యాయా?" అని అడిగేవాడు భద్రం.

"లేదండీ, తలనొప్పి" అని ఒకసారి, "ఇరుకు నొప్పి" అని ఇంకొకసారి ఆమె చెప్పినప్పుడు ఆ సారీ, ఈ సారీ, ప్రతిసారీ "నీ మొహం, నొప్పెంగాదూ?" అంటూ విసుక్కునేవాడు భద్రం.

జగ్గూ భార్య పనసపండంటి పిల్లాణ్ణి కన్న దన్నారు.

పనసపండంటే అసహ్యమేసింది భద్రానికి.

తన కా పండు గిట్టనే గిట్ట దనుకున్నాడు.

తొగడ అప్పుడప్పుడూ తిన్నా, మున్ముందు ముట్టుకోవని ఒట్టేసుకున్నాడు.

జగ్గూ కస్తూరి, పునుగు, జవ్వాది, ఖచ్చూరాలు మొదలైన సుగంధ ద్రవ్యాలు పంచిపెట్టాడు. బారసాలకు మంచి ముహూర్తం నిర్ణయించాడు.

"పోదాం పద, చిలకలపూడి" అన్నాడు భద్రం భార్యతో.

"ఎందుకు?"

"పినసారానికి."

తిరిగి వచ్చి మళ్ళీ నెలలు లెక్కబెట్టాడు భద్రం.

ఏడాది దాటిపోయింది.

ఒక రోజు భార్య శుభవార్త చెప్పింది.

ఆ రోజే ఆ వార్త ఊరంతా పాకింది, చాటించినట్టు.

లంకాకుమట్ట, చుట్ట మీద చుట్ట కాల్చాడు భద్రం.

జగ్గూ జరిపించిన హంగులన్నీ రెండింతలు చేసి జరిపించాడు భద్రం.

ఇంతా చేస్తే ఆడపిల్లను కనేసింది భద్రం భార్య.

విలవిల్లాడిపోయాడు భద్రం.

జగ్గూ కూడా బహుగా విచారించాడు.

చిన్నప్పట్నుంచీ పిల్లడితో పిల్లడు సిగపట్లు పట్టాలన్నది వారిద్దరి ఆంతర్యం.

ఇదివర కెన్నడూ జరగని ఈ కొత్త పరిణామాన్ని వారు ఊహించలేదు.

గుమ్మడిపండంటి పిల్లను చూసి ముచ్చట పడలేదు భద్రం.

"అదేమిటండీ, మరీ విడ్డూరం! ఆడపిల్లంటే లక్ష్మండీ లక్ష్మి" అని భార్య అంటే — "సరే, ఆ పేరే తగలెట్టుకో" అనేశాడు.

ఇతర హంగామాలేమీ తలపెట్టలేదు భద్రం. అతని భార్యే కొద్దిలో కొంచెం జరిపించి ఏదో లేదనిపించింది.

• • •

లక్ష్మి పుట్టేనాటికే బుడతడు పడుతూ లేస్తూ నడుస్తుండేవాడు. చిలక పలుకులు పలుకుతుండేవాడు. పాప పాకే రోజులు వచ్చేసరికి వీడు నడక క్షుణ్ణంగా నేర్చి గడప దాటి వీథి కెళ్ళడం నేర్చాడు.

వెళ్ళిన వాడు తిన్నగా ఉండక ఎదురింటి వసారాలో నేల మీద పాకుతున్న పాపను చూసి ఆకర్షితుడయ్యాడు. "పాపా, పాపా!" అంటూ దగ్గరకు చేరాడు.

ఆ పక్కనే వాలు కుర్చీలో కూర్చున్న భద్రం ఏం చెయ్యాలో తోచక ఆలోచనల్లో మునిగి తేలుతూ ఉండగా, వీడు జుట్టు పీకేశాడు.

పాప కెవ్వుమంది.

భద్రం తన పాలేర్ని కేకేసి "ఈ గుంట డెవడో చూడ్రా. పాప నల్లరి పెడుతున్నాడు. వీథిలో పడేసిరా!" అని గట్టిగా అరిచాడు, అక్కడి కా గుంట డెవడో తనకి తెలియనట్టూ, విషయం ఎదురింటికి వినబడాలన్నట్టూ.

వీథిలో విడువబడ్డ గుంటడు ఏడుపందుకున్నాడు.

భద్రం అరుపులూ, పిల్లవాడి ఏడుపూ నట్టింట్లో తల దువ్వుకుంటున్న జగ్గూ భార్య విని, గబగబా వీథిలో కొచ్చింది జారుముడేసుకుని.

పిల్లాణ్ణి చంకనేసుకుని సంగతేమిటై ఉంటుంది చెప్మా అని ఎదురింటికేసి చూసేసరికి — "చూడు, జుట్టెంత నొప్పేసిందో, గుక్కపట్టి ఏడుస్తోంది" అంటూ పాపని తన భార్య కందిస్తున్న భద్రం కనిపించాడు.

సంగతి గ్రహించిన జగ్గమ్మా, అంటే జగ్గూ భార్య జగ్గూ రాగానే జరిగింది చెప్పింది.

"శహబ్బాస్, బేటా!" అంటూ కొడుకుని ఎత్తి ముద్దాడాడు జగ్గూ.

"అంతేనా, ఇంకేమైనా జరిగిందా?" అంటూ భార్యని ప్రశ్నించాడు.

"ఈ రోజు కంతే జరిగింది" అన్నది.

ఆ రోజుతో పోలేదు.

సందు దొరికినప్పుడల్లా వీ డా ఇంట్లోకి జొరబడే వాడు.

ఒక రోజు దాని కంట్లో పొడిచి, మరో రోజు దాన్ని గిల్లి, ఇంకోసారి దాని గిలక్కాయి లాక్కుని, ఏసారి కా సారి ఇంట్లో నుంచి గెంటించుకున్నాడు.

"సిగ్గులేదు వెధవకి, ఎన్నిసార్లు గెంటించుకున్నా ... అయినా, ఆ పెద్దవాళ్ళకు ఉండద్దూ? అదుపులో పెట్టుకోలేరూ?" అని గొణుక్కున్నారు భద్రం, భద్రమ్మ.

ఒక రోజైతే వీడు చీకే చీకే బెల్లం ముక్క దాన్నోట్లో పెట్టేశాడు!

ఇంకేముంది! ?

ఉద్రిక్తుడై పోయిన భద్రం గాలినీ, ధూళినీ తిట్టాడు. బుద్ధుండా లన్నాడు. ఇటుపైన సహించ న్నాడు. పాప మైలపడి పోయిం దన్నంత గాభరా నటించి శుద్ధి చేయించాడు.

"అక్కడికి మేమేనా తక్కువ తిన్నది? మావాడు మాత్రం మైలపడలేదూ?" అంటూ జగ్గూ పిల్లాణ్ణి తొట్టెడు నీళ్ళలో ఝూడించాడు.

ఎన్నడూ లేనిది, తండ్రే స్వయానా స్నానం చేయిస్తుంటే బిడ్డడు సంబరపడిపోయి తండ్రితో కబుర్లలోకి దిగాడు.

"నాన్నా, నాన్నా, మరే, మరే, లచ్మే, భలే మంచి పాప, నాన్నా" అన్నాడో లేదో దభీమని వీపుమీ దొక టంటించి పాలికేక పెట్టాడు — "ఒసేవ్! ఒకమా రిలా రా" అని.

ఆ వచ్చిన ఇల్లాలు లబోదిబోమంటున్న కొడుకుని చూసి, మరొక టంటించబోతున్న భర్తను వారించి, "అయ్యో, అయ్యో! మీ కీ విపరీత బుద్ధు లెందుకు పుట్టిందండీ" అంటూ కొడుకు నందుకుని కొంగుతో తల తుడవడం ప్రారంభించింది.

"ఇన్నాళ్ళూ ఏదో అనుకున్నాను, వాడు ముదురు పాకాన పడ్డాడే!" అన్నాడు జగ్గూ.

"పసిపిల్లాణ్ణి పట్టుకుని అంత లేనిమాట లేమిటండీ! పాకమేమిటి? ముదరడమేమిటి?" అని సవాలు చేసిం దామె.

"లేకపోతే ఏమిటి? ఇన్నాళ్ళూ వీ డభిమన్యుళ్ళా పుటకతోనే పద్మవ్యూహ మెరిగిన వా డనుకున్నాను. తీరా మోసి చూస్తే వీ డీవే శంటాడూ —'ఆ లచ్మేమో భలే మంచిదటా' అని. ...



-జైరాజ్

తండ్రులిద్దరూ బహిరంగంగా తిట్టుకున్నది వారికి అర్థంకాకపోలేదు. అయినా, వీరిద్దరి స్నేహం చెడలేదు.

కృష్ణ వాళ్ళమ్మ నడిగాడు — "అసలెందుకమ్మా వాళ్ళకీ మనకీ విరోధం?" అని.

"అసలు జోలి నీ కెందుకురా, వడ్డీ సంగతి చూడరా వడ్డీ. మొన్ననగా మొన్న ఎన్నికల్లో మీ నాన్న నోడించాడా? మొన్నటిదాకా ఎందుకురా, నిన్నటి రాత్రి మన ధాన్యం కుప్పలు కాల్పించాడా? పౌరుషం లేదురా, పౌరుషం?" అన్నది తల్లి.

అంతకు ముందు రాత్రి భద్రం కుప్పలు ఎలా కాలాయో తెలిసిన కృష్ణ తల్లిని ప్రతిఘటించబోయి పరాభవింపబడ్డాడు.

"మా వంశంలో చెడబుట్టావురా, మా కడుపున చెడబుట్టావురా, ఛీ! మా కసలు కొడుకే లేదనుకుంటాంరా" అని తల్లి ఛీత్కరిస్తున్న సమయంలో జగ్గా వచ్చాడు. భార్య ఏకరువు పెట్టిన వంగతంతా విని కొడుకు పదో తరగతి చదువుతున్నాడే, పెద్దవాడయ్యాడే అన్నైనా ఆలోచించకుండా చాచి లెంపకాయ కొట్టాడు.

"చదువుకున్న వాడికంటే చాకలి మే"లని తిట్టాడు.

చిన్నబోయిన కృష్ణ కిమ్మనకుండా ఊరుకుండిపోయాడు.

నాటినుండీ తండ్రీ కొడుకులిద్దరూ ఎడమొఖం, పెడమొఖ మయ్యారు.

• • •

పరీక్షా ఫలితా లున్న దినపత్రికతో హుషారుగా ఇంటి కొచ్చాడు కృష్ణ. తండ్రి మెచ్చి మేక తోలు కప్పుతాడని గంపెడాశతో—"నాన్నా, నేను ఫస్టు క్లాసులో పాసయ్యా" నన్నాడు.

"అఘోరించావులే" అని పుల్ల విరిచినట్టనేశాడు జగ్గా.

జావగారిపోయాడు కృష్ణ.

"లాక్యం పిసరంత తెలిసేడవదు. అందులో పరీక్ష పెడితే మూడో తరగతైనా తెచ్చుకోలేవు. ఇదేదో ఘనకార్యం సాధించినట్టు చెబితే, సంబడ మనుకున్నావా, సంబడం?" అని హేళన చేశాడు.

తండ్రి తత్త్వం అంతేననీ, తాను నొచ్చుకున్నా ప్రయోజనం లేదనీ ఎరిగినవాడై — "మరి నే పై చదువుల కెళతాను" అన్నాడు నెమ్మదిగా కృష్ణ.

"ఎందుకోయ్, పై చదువు? అది చదివిన ప్రతి వాడికీ ఉద్యోగం చెయ్యాలనే ఉబలాటం. నీవుమాత్రం వెనకాడతావా? ఒకడి కింద ఉద్యోగం చెయ్యాల్సినంత ఖర్మ నీకేం పట్టలేదు. అయినా, ఊళ్ళట్టుకుని తిరుగుతా నంటే, నే పోయాక ఈ ఇంటి ఆలనా పాలనా చూసేవా డెవడు? మళ్ళేం గావాల? మాన్యాలేం గావాల? గొడ్డూ గోదా పట్టించుకునేవా డెవడు? కాబట్టి, అబ్బాయ్, ఇదుగో, ఖండితంగా చెబుతున్నాను — బాగా విను. పై చదువు కన్న మాట ముందు మరిచిపో. ఈ రోజునుంచీ ఇంటి పనులన్నీ అజమాయిషీ చెయ్. పాలేర్లున్నా రనగానే పనులన్నీ జరిగిపోవు. 'ఒరేయ్, ఆ బరిగొడ్డుని కడిగానా? దీనికి కుడితి పెట్టానా?'అని అడుగుతుండాల. సమయా సమయాల్లో నువ్వే సందిటతో ఇంత గడ్డి తీసుకెళ్ళి వాటి ముందు పడెయ్యాల. పొలం పనులంటావా, అయ్యా, తర్వాత నేర్చుకుందువుగాని. అన్నట్టు రాత్రి పంది కొక్కేదో గాదె కింద నానా గొడవా చేసింది. ఎన్నిసార్లు అదిలించినా కటకటా కొరుకుతూనే ఉండిపోయింది. రాత్రంతా నాకు దానితోనే సరిపోయింది. పో ... పోయి, ఆ గాదేదో జరిపించి ధాన్యం గతేమిటో కొంచెం చూడు. కన్నమేదైనా ఉంటే గట్టిగా పూడ్పించు. పూడ్చే ముందు గుడ్డ పొగేయించి మరీ పూడ్పించు. మళ్ళీ మళ్ళీ మనింటికి రాదు. ఎదరింటికి పోయిందా మరీ మంచిది. పో, పోయి పనూ్జనుకో" అంటూ ముగించాడు జగ్గా.

తండ్రి వాక్ప్రవాహాన్ని చూసి జడిసిపోయిన కృష్ణ ఇంకేం మాట్లాడలేక అక్కణ్ణుంచి లోపలికి పోయాడు.

చదువు మానేయక తప్పలేదు కృష్ణకి. ఏదో ఇంటి పనులని పేరేగాని తనకు తానుగా చెయ్యవలసిన పనులేమీ ఉండేవి గావు. లక్ష్మి తన దారిని తాను బడికి పోయేది. ఇంటిపట్టునుంటే తల్లి ఒక పక్కా, తండ్రొక పక్కా పనిగట్టుకొని భద్రం సంగతులే చెబుతూ తనని విషపూరితుణ్ణి చేయాలని గట్టి ప్రయత్నం చేసేవారు. ఈ విరోధానికి మూల కారణం తెలుసుకోవాలని కృష్ణ ప్రయత్నించాడు. ఇరుగు పొరుగుల్ని అడిగి చూశాడు. మాకు తెలియదంటే మాకు తెలియదన్నారు. కుమ్మరి వీథిలో ఓ పండు ముసలమ్మొంది, ఆమె వడిగితే చెబుతుందేమోనని సలహా ఇచ్చారు.

ముసలమ్మకు తా నెవరో చెప్పుకుని, ఆమె కేమైనా తెలిస్తే చెప్పమని కోరాడు కృష్ణ.

"అయితే, నువ్వు జగ్గన్నగా రబ్బాయివా,నాయనా?నువ్వడిగేసంగతులు ఈ నాటివా, ఆ నాటివా? కాస్తంత గుర్తుకు తెచ్చుకోనీయ్ మరి! ... ఆఁ! మీ బాబు కింకా మీసక ట్టొచ్చుండదు.



బలం

ఫోటో— కె. మధు ( తెనాలి )

అప్పటికే నా తల ముగ్గుబుట్టయింది. మారాజా, చ చ్చేలోకా నున్నాడో గాని, మీ తాత అప్పటికి బతికే ఉన్నాడు. తంగుమని మోగించి చూసేవాడుగాని బేరమంటూ ఆడేవాడు గాదు ... అవును గదూ? ... వాళ్ళ బాబు సంగతి గదూ నువ్వడుగుతూంట. ఉండుండు ... గుర్తుకొస్తూంది ... గుర్తు రాకపోవడమేమిటి? ఆయన గారికి పెద్ద పేరుండె! మీసం మీద నిమ్మకాయ నిలిపేవాడని. మీ ఇంటిపేరు మీసాల వారు గాదనుకో. మీసాల లచ్చా[illegible]నే వాళ్ళు. అసలు సుబ్బరా[illegible]నా, ఈయనా[illegible] ఒక కంచంలో తిని, ఒక మంచంలో పడుకునే వాళ్ళు. సుబ్బరామయ్యంటే ఎవరు? ఎవరనుకున్నావ్? ... ఇప్పుడు నువ్వడిగావే, ... ఏది? ... మీ తాతల్నాడు అవతలింటాళ్ళెవరని? ... అతగా డన్న మాట ... ఇద్దరూ చెయ్యొత్తు మనుషుల్నాయనా. సరీ సమా[illegible]ంగా చూడ ముచ్చటగా ఉండే[illegible]. అయినా, అవన్నీ ఇప్పుడెం[illegible], అసలు సంగతి [illegible]స్తున్నా

కొంతలో కొంత మేలేగదా అనుకున్నాను. అయినా, నిజం తెలియనప్పుడు నిబ్బరం పనికిరాదని జాగ్రత్తపడి నీకు చెప్పినట్టే మెల్లకన్ను పెట్టాను. ఓహో, మీనాక్షి అన్నాడు. పేరు బొంగురు గొంతుతో చెప్పాను. ఎక్కడా కోకిలారావం?" అన్నాడు. పాడమనలేదు. నేనే ఓడి పోయాను. అక్కడి కక్కడే వచ్చిందన్నాడు. అక్కడి కక్కడే తాంబూలా లన్నారు. ఇప్పు డేది దారి, కృష్ణా!?" అనిఉం దా చీటీలో.

"దొంగ రాస్కెల్!" అని తిట్టాడు నీలకంఠాన్ని.

"దారేదని వాపోవద్దు. తొందర పడి నీ దారి నువ్వు చూసుకోవద్దు. నేనున్నా నన్న విషయం మరిచిపోవద్దు" అని చీటీ అందించాడు. అందించాడే గాని, ముందు దా రేదో తనకే తెలియదు.

తల్లితో చెప్పాడు.

ఇప్పు డేది దారన్నాడు.

"ఎవరన్నా వింటే నవ్విపోతారు. నోరు మూసు కూరుకో. అవతల ముహూర్తం కూడా నిర్ణయించుకున్నారు. రేపులే ల్లుండే పెళ్ళి. అవతల ఆ పిల్లకూడా ఏదో అఘాయిత్యం తలపెట్టిందట. అది తెలుసుకుని వాళ్ళా పిల్లను నిర్బంధంలో ఉంచారట. ఆ వార్త బయటకు పొక్క కుండా వాళ్ళు నానా తంటాలు పడు తున్నారు. వాళ్ళెన్ని తంటాలు పడ్డా మనింటికి ఏ వార్తయినా తెలియకపోదు. తెలిస్తే తెలిసిందిలే, ఆడపిల్ల ఉసురు మన కెందుకు?" అనింది తల్లి.

"మయ్యి, గొయ్యి లేకుంటే ఉరి." బెదిరించాడు కృష్ణ.

"ఏమండీ, విన్నారా?" అంటూ గగ్గోలు పెడుతూ సంగతి చెప్పింది జగ్గూతో జగ్గమ్మ. "ఒక్కగా నొక్క నలుసండీ" అంటూ ముక్కు చీదింది.

జగ్గూ చలించిపోయాడు.

"కృష్ణా, నీ కిది పాడిగా" దన్నాడు. "అయినా, మాటమాత్రం మాతో చెప్పావా! నీదే తప్పు" అన్నాడు. "ఇప్పుడు వ్యవహారం చేయిదాటి పోయింది. నేనేం చేయగలను?" అని ఎదురుప్రశ్న వేశాడు.

అన్నం మాట దేవుడెరుగు. కృష్ణ నీరు ముట్టడం లేదు. రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మాని కాపలా కాస్తు న్నారు జగ్గమ్మా, జగ్గూ.

● ● ●

ఎదురింట్లో సన్నాయి మేళాలు సడన్‌గా నిలిచిపోయాయి.

"లేగరా, లే. ఇంకా ఆలోచిస్తా వేమిటి?" అంటూ నీలకంఠాన్ని పెళ్ళి పీటల మీద నుండి లేపేస్తున్నాడు వాళ్ళ నాన్న.

"బావగారూ, ఇంతలో ఏం లోటొ చ్చిందని మీ రిలా ప్రవర్తిస్తున్నారు? మీ కిది భావ్యం కాదు" అని ప్రాధేయ పడుతున్నాడు భద్రం.

"ఇంతకన్నా లోటేం గావాలయ్యా? ఇదిగో, నీ కూతురు రాసిన ఉత్తరాల కట్ట!" అంటూ ఇంత కట్ట భద్రం మీదికి విసిరేసి కొడుకు నీడ్చుకుని వీధిలో కొచ్చాడు నీలకంఠం నాన్న.

పెళ్ళి పందిరి కింద నానా గందర గోళంగా ఉంది.

అదంతా ఎదురింటికి కనబడుతూంది, వినబడుతూంది.

భద్రం గట్టిగా అరుస్తున్నాడు. "ఒరేయ్, జగ్గూ, విరోధముంటే కండ బలం, బుద్ధిబలం చూపించుకుంటూ వను కున్నాను గాని, ఇలా నీచాని కొడిగడతా వనుకోలేదురా. ఉచ్చ నీచాలు తెలిసి ఉన్న వాడెవడూ ఇలాంటి నెధవ పని చెయ్య డురా" అంటూ అరుస్తున్నాడు.

జగ్గూ, జగ్గమ్మా ఖ్రమాన్పడిపోయి వాళ్ళ వాకిట్లో వాళ్ళు నిలబడి చూస్తు న్నారు.

ముహూర్తం మించిపోతూందని బ్రాహ్మణులు అరుస్తున్నారు.

ఎప్పు డెళ్ళాడో, ఎలా గెళ్ళాడో కృష్ణ పెళ్ళి పందిట్లో కెళ్ళి భద్రం పక్క నిలబడ్డాడు.

"మీరు 'ఊఁ' అంటే ఆ మూడు ముళ్ళూ నే నేస్తా" నన్నాడు.

ఆశ్చర్యపోయి తటపటాయిస్తు న్నాడు భద్రం.

ఎప్పుడొచ్చాడో జగ్గూ పందిట్లో కొచ్చాడు. "కానీయ్, భద్రం, ఇంకా ఆలస్యమెందుకు? ముహూర్తం మించి పోతుం" దన్నాడు.

వివాహం జరిగిపోయింది.

చదివింపులప్పుడు పంతులు ఓ కవ రందుకుని చదివాడు — "మిత్రుడు నీలకంఠం వరునికి చదివించిన కట్నం ఓ సీలు వేసిన కవరు" అంటూ.

ఆ నాటి రాత్రి శోభనం గదిలోకి ప్రవేశించిన లక్ష్మి — ఏమిటి, కృష్ణా, ఆ ముచ్చు మొహం నీకు చదివించిన కట్నం?" అంటూ ప్రశ్నించింది సమయం, సందర్భం విస్మరించి.

"నేనూ నీలాగే తిట్టుకున్నాను. అదేమిటో నువ్వే చూడు" అంటూ కవ రందించాడు కృష్ణ.

అందుకుని ఉత్తరాన్ని వెలికి తీసి



వీరుడు

చిత్రం— వై. బాలయ్య (వద్దిపేట)

చదవ నారంభించింది లక్ష్మి.

"మై డియర్ కృష్ణా,

నీ వివాహాన్ని దగ్గరుండి జరిపించలేక పోయినందుకు మన్నించు. అది ప్రమే టిక్‌గా జరగాలి తప్ప వేరే దారి లేదని ముందే చెప్పాను. అలాగే జరిగినందుకు చాలా సంతోషిస్తున్నాను అయితే, నే నూహించినంతకన్నా వేగంగా జరిగి పోయింది. నే నింకా విడిది గదిలో ఉండ గానే నా కా వార్త తెలిసింది. బ్రేవో! అందుకే కట్నంగా ఈ లేఖ పంపుకో గలుగుతున్నాను. సోదరి లక్ష్మిని నా పైన కోపం ఉంచుకోవద్దని చెప్పు. ముందు ముందు మన కుటుంబాలు అవీ ఇవీ నూరుకోవు. ముందుగా నీవు గనక ఓ పననపండంటే కొడుకును ప్రసాదించు. ఆ తరవాత ఓ చిన్నారి లక్ష్మికోసం నే ప్రయత్నిస్తాను.

సెలవు...

—నీలం."

ఆ రాత్రి ముందుగా నీలం కథ కొంచెం చెప్పక తప్పలేదు కృష్ణకి. ★